ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

సంగారెడ్డి మెదక్

5

జిల్లాల వార్తలు

బుధవారం 24 సెప్టెంబరు 2025



అమృత్ భారత్‌తో రైల్వేస్టేషన్ల అభివృద్ధి
పనులు వేగవంతం చేయడానికి చర్యలు
సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ గోపాలకృష్ణ
జహీరాబాద్ స్టేషన్ పరిశీలన 7

పారదర్శకత విజయ డెయిరీ ప్రత్యేకత
టీజీడీడీసీఎఫ్ జీఎం మధుసూదన్‌రావు 7



కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ సంబరాల్లో భాగంగా సంగారెడ్డి కలెక్టరేట్‌లో రెండో రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ప్రావీణ్య హాజరై గౌరమ్మకు, తీరొక్క పూలతో రూపొందించిన బతుకమ్మలకు పూజలు చేశారు. అనంతరం వివిధ శాఖల జిల్లా మహిళా అధికారులు, మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ సెక్రటరి పద్మజ రమణ, అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్‌వో పద్మజా రాణి, సీడీపీవో చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సీఎంఆర్‌ఎఫ్

చెక్కులు అందజేసిన నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని 109 మంది పేదలకు రూ.55లక్షల విలువైన చెక్కులను టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అందజేశారు. అనారోగ్యంతో కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందుతున్న ఆర్థిక సాయం ఎంతగానో ప్రయోజనకరంగా ఉందని నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. చెక్కులు అందుకున్న పేదలు నిర్మలా జగ్గారెడ్డితో పాటు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ జూలకంటి ఆంజనేయులు, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ప్రభుగౌడ్, మోతీలాల్, సిద్దన్న, కూన సంతోష్, కిరణ్‌గౌడ్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న నిర్మలా జగ్గారెడ్డి



7

హైవే విస్తరణ పనులను

అడ్డుకున్న భూబాధితులు


వైద్యశాఖలో పోస్టుల భర్తీకి

డ్రాఫ్ట్ మెరిట్ జాబితా

30వ తేదీ వరకు అభ్యంతరాలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో మరో పది కేటగిరీల్లో పోస్టుల భర్తీకి సంబంధించిన డ్రాఫ్ట్ మెరిట్ జాబితాను అధికారులు విడుదల చేశారు. జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితాను మంగళవారం పొందుపర్చారు. స్టాఫ్‌నర్స్ (ఎంఎస్‌సీ నర్సింగ్), ఫార్మసిస్ట్, ఎంఎల్‌హెచ్‌పీ (ఎంబీబీఎస్), ఎంఎల్‌హెచ్‌పీ (బీఏఎంఎస్), మెడికల్ ఆఫీసర్, ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ (ఎంబీబీఎస్ అండ్ ఆయూష్), డేటాఎంట్రీ ఆపరేటర్, డీఈఐసీ మేనేజర్, కాంటిజెంట్ వర్కర్, సపోర్టింగ్ స్టాఫ్ పోస్టులు ఉన్నాయి. ఆయా పోస్టుల డ్రాఫ్ట్ జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే నేటి నుంచి 30వ తేదీ వరకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

బాప్‌రే ఏఐ!



అంతా మాయాజాలం.. ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు..

దుర్వినియోగమైతే.. తప్పని ముప్పు

సోషల్ మీడియా ఖాతాల్లోని సమాచారం పక్కదారి

సైబర్ నేరగాళ్ల చేతికి వ్యక్తిగత వివరాలు

బ్యాంక్ అకౌంట్లు ఖాళీ చేసే ప్రమాదం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్... అన్ని రంగాలను షేక్ చేస్తోంది. ఎవరి ఫోన్ చూసినా త్రీడీ ఇమేజ్‌లు, ఏఐ ద్వారా సృష్టించిన ఫొటోలే కనిపిస్తున్నాయి. మనుషులతో పాటు పక్షులు, జంతువులు, సంఘటనలు, చిత్రాలు సృష్టించడం తేలికైంది. ప్రస్తుతాని ఇదోక వినోదమే అయినా.. భవిష్యత్‌లో ముప్పుగా మారే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏఐ కారణంగా ఉద్యోగాలు పోవడం ఏమో కానీ, జీవితాలే కూలిపోయే ప్రమాదముందని అభిప్రాయపడుతున్నారు. ఏఐలో అప్‌లోడ్ చేస్తున్న ఫొటోలకు రక్షణ లేదని, మహిళలు, పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

-సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి)

ఏఐ సృష్టిస్తున్న వివిధ రకాల వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. నిజాన్ని కూడా నమ్మలేని పరిస్థితి నెలకొన్నది. ఏఐ ద్వారా ఇటీవల ఓ తాను సృష్టించిన ఫొటోపై ఓ సెలెబ్రిటీ చేసిన వ్యాఖ్యలు వైరల్ అయిన విషయం తెలిసిందే. ఇదే ఏఐ సామాన్యుల జీవితాల్లోకి చొరబడితే అనేక కుటుంబాలు కూలిపోయే ప్రమాదం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

సోషల్ మీడియా ఖాతాలు హ్యాక్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో అప్‌లోడ్ చేస్తున్న ఫొటోలు, సమాచారం సైబర్ నేరగాళ్ల చేతిలో పడుతున్నది. వీటి ఆధారంగా సోషల్ మీడియా, బ్యాంక్ అకౌంట్లను హ్యాక్ చేస్తున్నారు. ఫేస్‌బుక్‌లో స్నేహితులకు డబ్బులు అడుగుతూ మెసేజ్‌లు పంపుతున్నారు. అంతేగాక వ్యక్తిగత వివరాలను చోరీ చేసి బ్యాంకు ఖాతాలను కొల్లగొడుతున్నారు.



మొబైల్ ఫోన్‌ల ద్వారానే అత్యధికంగా నేడు డిజిటల్ లావాదేవీలు కొనసాగుతున్నాయి. ఫోన్‌పే, గుగూల్‌పే ద్వారా చెల్లింపులు జరుగుతున్నాయి. సైబర్ నేరగాళ్లు ఫోన్‌పే, గుగూల్‌పే యాప్‌లను హ్యాక్ చేసే ప్రమాదం లేకపోలేదని పోలీసులు పేర్కొంటున్నారు.

అప్రమత్తతతోనే రక్షణ

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ద్వారా ఆన్‌లైన్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేయడం భద్రతాయోగ్యం కాదని పోలీసులు సూచిస్తున్నారు. ఆన్‌లైన్‌లోని కొన్ని వెబ్‌సైట్‌లలో వ్యక్తిగత ఫొటోలను, వివరాలను ఇవ్వడం వల్ల సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వ్యక్తిగత సమాచారం వెళ్లే అవకాశం ఉందంటున్నారు. ఏఐలో సరదా కోసం ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నప్పటికీ కొందరు సైబర్ మోసగాళ్ల కారణంగా ముప్పు వాటిల్లే ప్రమాదం లేకపోలేదని అంటున్నారు. సైబర్ నేరాలపై ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసేందుకు పోలీసుశాఖ విస్తృత ప్రచారం చేస్తోంది.

చెరువును కాపాడాలని నిరసన

ఫ్యాక్టరీ వ్యర్థాలతో మూగజీవాల మృత్యువాత

ప్రజలకు ఆరోగ్య సమస్యలు.. ప్రకృతి ప్రేమికుడి ఆవేదన

సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట దీక్ష.. భగ్నం చేసిన పోలీసులు



జ్ఞానేశ్వర్ దీక్షను భగ్నం చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న సంగారెడ్డి పోలీసులు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమ వ్యర్థ జలాలతో కలుషితమైపోయిన చెరువును కాపాడాలంటూ ఓ ప్రకృతి ప్రేమికుడు కలెక్టరేట్ ఎదుట నిరశన దీక్షకు దిగాడు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో ఓ పరిశ్రమ వ్యర్థ జలాలతో నల్లకుంట చెరువు కలుషితమవుతోందని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ ప్రకృతి ప్రేమికుడు జ్ఞానేశ్వర్ మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట నిరశనకు కూర్చున్నారు. నల్లకుంట చెరువులో నీరు కలుషితం కావడంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని, ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని జ్ఞానేశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. చెరువును పరిరక్షించాలనే నిరశన చేస్తున్నానని తెలిపారు. జ్ఞానేశ్వర్ దీక్ష విషయం తెలుసుకున్న పోలీసులు ఆయన్ను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

గాయత్రీదేవిగా అమ్మవారు...

ఉమ్మడి జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నారు. నవరాత్రుల్లో రెండోరోజు అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఏడుపాయల వనదుర్గామాత క్షేత్రం, దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన ఝరాసంగం కేతకీసంగమేశ్వర ఆలయంలో అమ్మవారిని అర్చకులు పట్టు వస్త్రాలు, పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

-పాపన్నపేట/ఝరాసంగం, (ఆంధ్రజ్యోతి)





ఝరాసంగం కేతకీసంగమేశ్వర ఆలయంలో పూజలకు హాజరైన భక్తులు



ఏడుపాయలలో వనదుర్గామాతకు పూజలు

అభ్యాస దీపికలు

వచ్చేశాయి

సంగారెడ్డి జిల్లాకు 56,428

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించే లక్ష్యంతో రాష్ట్ర విద్యా పరిశోధన, అభివృద్ధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో అభ్యాస దీపికల పంపిణీకి విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లాకు 56,428 పుస్తకాలు చేరుకున్నాయి. దసరా సెలవుల అనంతరం జిల్లా వ్యాప్తంగా ఉన్నత పాఠశాలకు వాటిని చేరవేయనున్నారు. గతేడాది పదో తరగతి ఫలితాల్లో సంగారెడ్డి జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. ఈసారి నంబర్‌వన్‌గా నిలపడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తున్నది. అభ్యాసన దీపికలతో విద్యార్థులకు మేలు జరగనున్నది. ప్రత్యేక స్టడీ మెటీరియల్ చదవడం ద్వారా విషయ పరిజ్ఞానం పెంపొందడమే కాకుండా ఉత్తీర్ణత శాతం పెరుగుతుందని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.

డిజిడల్ సర్వే!

కోతకొచ్చే దశలో పంటల వివరాల నమోదు

నెల రోజుల్లో చేసింది 25 శాతమే..

యాప్ రూపకల్పనలో జాప్యం

సర్వే వివరాల ఆధారంగానే కొనుగోళ్లు

ఆందోళనలో అన్నదాతలు



రామాయంపేటలో పంట వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

మెదక్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో వానాకాలం పంటల వివరాల నమోదు ప్రక్రియ ప్రహసనంలా మారింది. ఓవైపు ధాన్యం సేకరణను ప్రారంభించడానికి పౌరసరఫరాలశాఖ సన్నాహాలు చేస్తుండగా.. మరోవైపు వ్యవసాయశాఖ యంత్రాంగం పంటల నమోదు కొనసాగిస్తున్నారు. సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడిచినా ఇంకా 25 శాతం వివరాల నమోదు కూడా పూర్తికాలేదు.

3.45 లక్షల ఎకరాల్లో పంటల సాగు

ఈ వానాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 3.45 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగుచేశారు. ఇందులో అత్యధికంగా వరి పంటనే రైతులు ఎంచుకున్నారు. జూన్ రెండో వారంలో ప్రారంభమైన పంటల సీజన్ పూర్తవుతున్నా ఇప్పటి వరకు కేవలం 25 శాతం మాత్రమే డిజిటల్ క్రాప్ బుకింగ్ అయినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 75వేల ఎకరాల్లో పంటల సర్వే పూర్తిచేసినట్లు అధికార యంత్రాంగం తెలిపింది. మిగిలిన 75 శాతం పంటలను త్వరలోనే పూర్తి చేస్తామని పేర్కొనడం గమనార్హం. క్రాప్‌బుకింగ్ పూర్తయిన తరువాతనే ధాన్యం కొనుగోలు చేయాలని ఇంకా ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదని తెలిపారు.

పక్షంలో కోతలు ప్రారంభం

జిల్లాలో మరో రెండు వారాల్లో వరి కోతలు ప్రారంభమయ్యే అవకాశముంది. ఇప్పటికే డిజిటల్ రిజిస్ట్రేషన్ లోపాలు, సర్వే ఆలస్యం కావడం రైతులను ఆందోళనకు గురి చేస్తున్నది. మండల వ్యవసాయ విస్తీర్ణాధికారుల ఆధ్వర్యంలో ఆగస్టు 25 నుంచి జిల్లాలో డిజిటల్ పంటల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసారి రాష్ట్ర వ్యవసాయ కమిషనరేట్ నుంచి డిజిటల్ క్రాప్ బుకింగ్ యాప్ రూపొందించడంలో తీవ్ర జాప్యం జరిగింది. యాప్‌లో మార్పులతో గతంలో మాదిరిగా కాకుండా ఈసారి అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను సందర్శించి నమోదు చేయాల్సి వస్తోంది. డిజిటల్ సర్వేలో మండల వ్యవసాయ విస్తీర్ణాధికారులకు పలు సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. సర్వర్, నెట్‌వర్క్ సమస్యలు ఎదురవుతున్నాయి. యూరియా కొరత సమస్య తీర్చడంలోనే తలమునకలైన వ్యవసాయ అధికారులకు డిజిటల్ సర్వే భారంగా పరిణమిస్తోంది.

సర్వే కాకుంటే అంతే..

పంట సేకరణకు సర్వే ఆలస్యం అడ్డంకిగా మారే ప్రమాదం నెలకొన్నది. పంట కోత పూర్తి చేసినా సాగు వివరాలు రిజిస్ట్రేషన్ చేయకపోతే కేంద్రాల్లో కొనుగోలు చేసే అవకాశం లేదు. ఒకవేళ తూకం పూర్తయినా రైతులకు డబ్బు జమ చేయడం ఆలస్యమయ్యే అవకాశముంది. పంట రిజిస్ట్రేషన్ ఆధారంగా వచ్చే ప్రభుత్వ రుణాలు కూడా నిలిచిపోయే ఆస్కారముంది.

25 శాతం సర్వే పూర్తి

జిల్లావ్యాప్తంగా 76 క్లస్టర్ల పరిధిలో డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహిస్తున్నాం. 3.45 లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తుండగా ఇప్పటి వరకు 75వేల ఎకరాల్లో పంటల వివరాలను నమోదు చేశాం. త్వరలోనే మిగిలిన వివరాలు కూడా నమోదు చేస్తాం. రెండు వారాల్లో వరి కోతలు ప్రారంభమవుతాయని అంచనా వేస్తున్నాం. క్రాప్ బుకింగ్ పూర్తయితేనే ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు.

-దేవ్‌కుమార్, డీఏవో, మెదక్

ఎంబీబీఎస్ ఫస్టియర్

విద్యార్థులు వచ్చేస్తున్నారు

జాతీయ కోటాలో 13 మంది, రాష్ట్ర కోటాలో 81 మంది చేరిక

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో 2025-26 ఏడాదికి సంబంధించి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ఫేజ్-1లో భాగంగా ఆలిండియా కోటాలో 22 సీట్లు కేటాయించగా, 13 మంది జాయిన్ అయ్యారు. స్టేట్ కోటా కింద 90 మందికి సీట్లు కేటాయించగా 81 మంది ప్రవేశాలు పొందినట్టు కళాశాల అధికారులు తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థుల ధ్రువపత్రాలను కళాశాల అధికారులు క్షుణంగా పరిశీలించి జాయినింగ్ ఉత్తర్వులు అందజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.సుమయ ఆధ్వర్యంలో వైద్య విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియ కొనసాగింది.



ప్రవేశాలు పొందుతున్న ఫస్టియర్ వైద్య విద్యార్థులు

ట్రిపుల్ ఆర్ పరిహారం..

నిర్వాసితుల ఖాతా వివరాల సేకరణ

తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి

తూప్రాన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రీజనల్ రింగ్ రోడ్డు కోసం సేకరించిన భూమికి పరిహారం చెల్లింపునకు రైతుల బ్యాంకు ఖాతాల వివరాలను సేకరిస్తున్నట్లు తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో మంగళవారం ఆయన తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ట్రిపుల్ ఆర్ భూసేకరణ పరిహారం చెల్లింపు ప్రక్రీయ వేగవంతం చేసినట్లు వివరించారు. భూములు కోల్పోతున్న రైతులకు న్యాయపరమైన పరిహారం బ్యాంకు ఖాతాల్లో జమా చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తూప్రాన్ డివిజన్ పరిధిలో 630 మంది రైతుల నుంచి భూమిని సేకరిస్తుండగా, 505 మంది రైతులు తమ బ్యాంకు ఖాతాలను అందజేసినట్లు ఆర్డీవో వివరించారు. ఖాతాలు సమర్పించిన రైతుల ఖాతాల్లో పరిహారం నేరుగా జమా చేయనున్నట్లు వివరించారు. బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వని రైతులకు పరిహారం చెల్లింపు జరగదని తెలిపారు. ఇప్పటివరకు ఖాతా వివరాలు సమర్పించని రైతులు వెంటనే రెవెన్యూ డివిజన్ కార్యాలయ సిబ్బందికి తమ బ్యాంకు ఖాతాల పాస్‌బుక్, ఆధార్ కార్డు, అవసరమైన పత్రాల నకలు సమర్పించాలని ఆర్డీవో సూచించారు. కొందరు రైతులు నష్టపరిహారం పెంపు కోసం కోర్టును ఆశ్రయించాలనే ఉద్ధేశంతో బ్యాంకు ఖాతాల వివరాలు తెలుపడంలేదని ఆయన పేర్కొన్నారు. అటువంటివారు నష్టపరిహారం పొందిన తరువాత కూడా కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపారు. ఖాతాల వివరాలు ఇవ్వకుంటే కలెక్టర్ మధ్యవర్తిత్వంతో ఇచ్చే పరిహారం పెంపు అవకాశం సైతం కోల్పోతారని వివరించారు. భూమిని కోల్పోతున్న రైతులందరికీ పరిహారం ఇవ్వడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.



రైతులకు నోటీసులు అందజేస్తున్న అధికారులు



ఉధృతంగా..

● పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

● గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు

వెల్దుర్తి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి వెల్దుర్తి మండలంలోని చెరువులు, చెక్ డ్యామ్‌లు పొంగిపొర్లుతున్నాయి. సోమవారం రాత్రి కురిసిన వానకు మండల కేంద్రంలోని దేవతల చెరువులోకి భారీగా నీరు చేరడంతో అలుగు పారుతోంది. అలాగే ఉప్పులింగాపూర్ గ్రామ శివారులోని హల్దీవాగు కూడా ఉధృతంగా ప్రవహిస్తోంది. వర్షాల వల్ల ఉప్పులింగాపూర్, యశ్వంతరావుపేట గ్రామాల్లో రెండు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, వాటిని పరిశీలించి పంచనామా నిర్వహించినట్లు ఆర్ఐ నర్సింగ్‌యాదవ్ తెలిపారు.ఎలుకపల్లి గ్రామంలో ఈదురు గాలులతో కూడిన వర్షానికి ఒక పశువుల పాక ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ. లక్ష విలువైన ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కానికే యాదగిరి కోరారు.

● తూప్రాన్ : తూప్రాన్ మండలం, సిద్దిపేట జిల్లా వర్గల్ మండలాల్లో కురిసిన భారీ వర్షాలకు హల్దీవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. తూప్రాన్‌లో 46.3 మి.మీ, వర్గల్‌లో 52.8 మి.మీ వర్షం నమోదైంది. వాగులో వరద ప్రవాహం పెరిగి కాజ్‌వేలపై మీటరున్నర ఎత్తులో ప్రవహిస్తోంది. దీంతో తూప్రాన్-కిష్టాపూర్ గ్రామాల మధ్య, అలాగే కిష్టాపూర్, వెంకటాయపల్లి, నర్సంపల్లి, బేగంపేట, అప్పాయపల్లి, ఎల్కల్, గౌడిగూడెం, గుండ్రెడ్డిపల్లి, మల్కాపూర్, కోనాయపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.


వెల్దుర్తి : మత్తడి దూకుతున్న దేవతల చెరువు


తూప్రాన్ వద్ద హల్దివాగు..

● మిరుదొడ్డి : మిరుదొడ్డి మండలం ఆరెపల్లి శివారులో భారీ వర్షానికి రోడ్డుపై ఓ పెద్ద చెట్టు విరిగిపడింది. ఎస్సై సమత సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థుల సహాయంతో చెట్టును తొలగించారు.

● చేర్యాల : చేర్యాల మండలంలోని తాడూరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గ్రామ శివారులోని లోలెవల్ కాజ్‌వేపై వరద ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

● నంగనూరు మండలం సంతోష్ నగర్‌లో 7 మూగజీవాలు, మగ్దంపూర్‌లో పాడి గేదె పిడుగు పడి మృత్యువాతపడ్డాయి.


చేర్యాల మండలం తాడూరు గ్రామశివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

సింగూరుకు పెరుగుతున్న వరద


పుల్కల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాలైన కర్ణాటక, మహారాష్ట్రల్లో కురుస్తున్న వర్షాలకు సింగూరు ప్రాజెక్టులోకి వరద ప్రవాహం మరింతగా పెరిగింది. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 58,892 క్యూసెక్కులుగా నమోదైంది. ఏడు క్రస్ట్ గేట్ల ద్వారా 56,597 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి గేటు గుండా 1,635 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 120 క్యూసెక్కులు, హెచ్ఎండబ్ల్యూఎస్‌కు 80, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మిగిలిన 390 క్యూసెక్కులు ఆవిరి అవుతోంది. మంగళవారం నాటికి ప్రాజెక్టులో 520.515 మీటర్ల వద్ద 16.607 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అలాగే, సంగారెడ్డి సమీపంలోని మంజీర రిజర్వాయర్ నుంచి కూడా నాలుగు క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని ఘనపురం ప్రాజెక్టుకు వదులుతున్నారు.


ఐదు తులాల పుస్తెలతాడు అపహరణ : దర్యాప్తు చేస్తున్న పోలీసులు

గుమ్మడిదల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని దొంగలు ఓ మహిళ మెడలో నుంచి ఐదు తులాలు ఖరీదైన పుస్తెలతాడు అపహరించి పారిపోయిన సంఘటన మంగళవారం గుమ్మడిదల పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఉంటున్న గుమ్మడిదల గ్రామానికి చెందిన రాధమ్మ మెడలో నుంచి 50గ్రాములు పుస్తెలతాడును గుర్తు తెలియని వ్యక్తి వచ్చి మంచినీళ్ల కావాలంటూ చెప్పి ఎవరూ లేరని గ్రహించి లాక్కొని వెళ్లాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలవడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.









పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

వర్గల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన భర్తను భార్య మందలించడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ మండలం మీనాజీపేట గ్రామానికి చెందిన కీసరి రాజు (30) కొంత కాలం నుంచి తాగుడుకు బానిసై భార్య మహేశ్వరీతో గొడవ పడేవాడు. ఈ నెల 9న రాత్రి రాజు మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య మహేశ్వరీ ఎందుకు తాగుతున్నావని మందిలించడంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత ఇంటికొచ్చి నిద్రపోయాడు. తరువాత రోజు ఉదయాన్నే రాజు వాంతులు చేసుకోవడంతో ఏమి జరిగిందని ఆరా తీయగా పురుగుల మందు తాగినట్లు చెప్పాడు. చికిత్స కోసం ములుగు లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో తాపీ మేస్త్రీ మృతి

వెల్దుర్తి, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో విద్యుత్ రావడం లేదని ఇంటిపై కప్పు ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ తాపీమేస్త్రీ మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన వెల్దుర్తిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన తాపీ మేస్త్రీలు నారాయణశర్మ(37), ప్రభుకుమార్ శర్మ, వినోద్‌శర్మ, సంతోష్ శర్మ, దల్లు శర్మలు మండల కేంద్రమైన వెల్దుర్తిలోని డబుల్ బెడ్‌రూమ్‌లలో కిరాయికి ఉంటున్నారు. సోమవారం రాత్రి ఇంట్లో విద్యుత్ సరఫరా లేదని ఇంటిపై కప్పు ఎక్కి నారాయణశర్మతోపాటు ప్రభుకుమార్‌శర్మ, వినోద్‌కుమార్‌శర్మ, సంతోష్‌శర్మ, ధల్లుశర్మ మరమ్మతులు చేస్తుండగా నారాయణశర్మకు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో తన వెనుక ఉన్న పిల్లర్‌పై పడ్డాడు. దీంతో తలకు బలమైన గాయమై స్పృహ తప్పి పడిపోయాడు. చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే నారాయణశర్మ మృతి చెందినట్లు తెలిపారు.

రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని వ్యక్తి ..

పటాన్‌చెరు సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం పాలయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సింగిపేట గ్రామం తాండూరు మండలం వికారాబాద్ జిల్లాకు చెందిన పండరప్ప (52) నర్సింలు, నరేష్, వెంకటయ్యలతో కలిసి మంగళవారం తెల్లవారుజామున పటాన్‌చెరుకు వచ్చారు. టీ తాగడానికి పండరప్ప రోడ్డు దాటుతుండగా లింగంపల్లి నుంచి సంగారెడ్డి వెళ్తున్న కారు ఢీకొట్టింది. తీవ్రగాయాలయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ముగ్గురు పిల్లలతో తల్లి అదృశ్యం

పటాన్‌చెరు సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు పిల్లలతో తల్లి అదృశ్యం అయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాలు.. ఇంద్రేశం పట్టణంలో నివాసం ఉంటున్న శరణప్ప ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 19న ఉదయం బయటకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చే సమయానికి భార్య దుర్గమ్మ, కుమారులు దేవరాజ్, నాగరాజు, కుమార్తె రమాదేవిలు కనిపించలేదు. చుట్టుపక్కల వారిని, బంధువులను అడిగినా ఫలితం లేకపోవడంతో మంగళవారం శరణప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

జాతీయ రహదారిపై లారీ బోల్తా

కంది, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని 65 జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున ఓ ఇనుప పట్టీల లోడు లారీ బోల్తాపడింది. లారీ క్యాబిన్ నుంచి ఇనుప పట్టీలు బయటకు చొచ్చుకుపోవడంతో డ్రైవర్, క్లీనర్‌లకు గాయాలయ్యాయి. విద్యుత్ టవర్ నిర్మించే ఇనుప పట్టీల సామగ్రి లోడ్ వేసుకుని మహారాష్ట్ర వైపు వెళ్తుంది. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో కంది శివారులో ఓ ట్రక్కును పక్క నుంచి రాడండంతో లారీని సైడ్ తీసుకున్నాడు. అక్కడ తవ్విన గుంతలో లారీ అదుపుతప్పి బోల్తా పడింది. వెంటనే టవర్ పట్టీలు లారీ క్యాబిన్ నుంచి బయటికి చొచ్చుకువచ్చాయి. దీంతో డ్రైవర్ రాజ్‌కుమార్‌కు కాలుకు, క్లీనర్ వినాయక్ తలకు, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకని దర్యాప్తు చేస్తున్నట్లు సంగారెడ్డి రూరల్ ఎస్సైరవీందర్ తెలిపారు.


జాతీయ రహదారిపై బోల్తాపడిన లోడు లారీ

చెవి కమ్మల చోరీకి యత్నం

సిద్దిపేట రూరల్,సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి చెవి కమ్మలు చోరీకి యత్నించిన దొంగను గ్రామస్థులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు పట్టించారు. ఈ సంఘటన నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వృద్ధురాలు దాసరి ఎల్లవ్వ తన పొలం వద్దకు వెళ్తుండగా కరీంనగర్‌కు చెందిన అనిల్ ఆమెపై దాడి చేసి చెవి కమ్మలు లాక్కుంటుండగా చుట్టు పక్కల వారు గమనించి దొంగను పట్టుకుని చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేశారు. అనంతరం చిన్నకోడూరు ఎస్సై సైఫ్ అలీకి పట్టించారు.

సెల్‌ఫోన్ దొంగిలించి.. డబ్బులు కాజేసి..

పటాన్‌చెరు సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బస్సు ఎక్కుతున్న ఓ వ్యక్తి ఫోన్ దొంగిలించి ఫోన్ నంబరు ఆధారంగా బ్యాంకు ఖాతాలో డబ్బులు వేరే ఖాతాలోకి మళ్లించిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నేరాల పరిశోధన విభాగం సీఐ రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇస్నాపూర్ పురపాలక పట్టణ పరిధి అఖిలఫామ్‌నగర్‌లో నివాసం ఉంటున్న వీర్‌సెట్టి గత నెల 31న ఇస్నాపూర్ కూడలిలో బీదర్ వెళ్లే బస్సు ఎక్కారు. సీట్లో కూర్చున్న తరువాత చూసుకుంటే ఫోన్ కనిపించలేదు. వేరే ఫోన్‌తో తన నంబరుకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ దొంగిలించారు. ఈ నెల 7న డబ్బులు తీసుకోవడానికి బ్యాంకుకు వెళ్తే ఖాతాలోంచి రూ.3లక్షల60వేల 800లు వేరే ఖాతాలోకి ఫోన్ నంబరు ఆధారంగా మళ్లించారు.

క్షయ నివారణ పై చాంపియన్స్‌కు శిక్షణ

కొండపాక, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నివారణ కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్టు ప్రతినిధులు భైటి రజనీకాంత్, రాజు,కొండపాక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శ్రీధర్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధన్ రాజ్ ,జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అరుణ్ కుమార్ ఆదేశంతో ఇంపాక్ట్ ప్రాజెక్ట్ ద్వారా టీబీ అవగాహన సదస్సును మంగళవారం కొండపాకలో నిర్వహించారు. కొండపాక, కుకునూరు పల్లి , తొగుట పీహెచ్‌సీ ల పరిధిలోని 16 సబ్ సెంటర్లకు చెందిన 25 మంది టీబీ చాంపియన్స్‌కు శిక్షణ ఇచ్చారు. గతంలో టీబీ వ్యాధికి గురై మందులు వాడి వ్యాధినుంచి కోలుకొని నయమైన వారిని టీబీ చాంపియన్స్‌గా పిలవబడతారని పేర్కొన్నారు. ఈ చాంపియన్స్‌కి టీబీ వ్యాధి పట్ల పూర్తి అవగాహన కల్పించి వ్యాధి లక్షణాలు, వ్యాధి నిర్ధారణకు తీసుకోవాల్సిన పరీక్షలు చికిత్సలపై అవగాహన కల్పించారు.

సమగ్ర దర్యాప్తు జరపాలి : సంగారెడ్డి ఎస్పీ పంకజ్

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తు చేయాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పోలీసు అధికారులకు సూచించారు. జిల్లాలో పోలీసుల పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ, దర్యాప్తు సామర్థ్యాన్ని పెంచేందుకు సాంకేతికత వినియోగంలో సంగారెడ్డి జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల ఛేదనకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డయల్ 100కు సత్వరమే స్పందించి బాధితులకు అండగా నిలువాలన్నారు. ఎస్‌హెచ్‌ఓలు ప్రతి గ్రామాన్ని సందర్శించి, అయా ప్రాంతాల్లో ఉన్న సమస్యలను తెలుసుకోవాలన్నారు. సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ అన్ని కుల మతాలకు చెందిన పవిత్ర స్థలాల్లో, పరిశ్రమల్లో ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొనే విధంగా చూడాలని ఎస్పీ పంకజ్ సూచించారు. వీధి రోడ్లకు ఉన్న కెమెరాలను నేను సైతం కెమెరాలుగా జియో ట్యాగ్ చేయించే విధంగా వివిధ సంఘాల పెద్దలకు అవగాహన కల్పించాలన్నారు.



బాలాత్రిపుర సుందరిగా..

కొండపాక, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మర్పడగ విజయదురామాత బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ వర్ణాల గాజులతో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



400 కిలోలతో కుంకుమార్చన

గజ్వేల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని మహంకాళీ దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా రెండవ రోజు అమ్మవారు త్రిమూర్తి అలంకారంలో దర్శనమిచ్చారు. 400 కిలోల కుంకుమతో అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు.



గాయత్రీ దేవిగా..

గుమ్మడిదల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్ర స్వామి దేవస్థానంలోని భద్రకాళి అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల పెద్దఎత్తున తరలివచ్చారు.

వైభవంగా కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

గుమ్మడిదల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదలలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. బ్రహ్మోత్సవాల తొలి రోజున శాస్త్రోక్త పద్ధతిలో చెరువు మట్టిని స్వామివారికి సమర్పించారు. గ్రామ శివారులోని చెరువు నుంచి పవిత్రమైన మట్టిని తీసుకొచ్చి వేద పండితుల సమక్షంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామికి పూజలు చేశారు.బ్రహ్మోత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ మద్దుల బాల్ రెడ్డి తెలిపారు. ప్రతిరోజూ ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని, ఇందులో రథోత్సవం, గరుడసేవ, హనుమంత వాహన సేవ, కల్యాణ మహోత్సవం వంటివి ఉంటాయని వివరించారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. బ్రహ్మోత్సవాల విజయవంతం కోసం గ్రామ యువత, ప్రజలు స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు, పాల్గొన్న భక్తులు



కోర్టు ఉత్తర్వులను చూపుతున్న భూబాధితులు

జాతీయ రహదారి విస్తరణ పనులను

అడ్డుకున్న భూబాధితులు

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఆదేశాలను దిక్కరిస్తూ తమ స్థలాల్లో రోడ్డును వేస్తున్నారంటూ పలువురు భూ బాధితులు మంగళవారం జాతీయరహదారి విస్తరణ పనులను అడ్డుకున్నారు. సంగారెడ్డి చౌరస్తాలోని పోతిరెడ్డిపల్లి నుంచి కంది శివారులోని ఐఐటీహెచ్ వరకు దక్షిణ భాగం వైపు తమకు సంబంధించి స్థిరాస్థులను కూల్చివేస్తూ విస్తరణ చేపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ నుంచి రెండు వైపులా వంద ఫీట్ల చొప్పున రోడ్డును విస్తరించాలని హైకోర్టు తీర్పు ఇచ్చినా నేషనల్ హైవే అథారిటీ డిప్యూటీ ఈఈ రామకృష్ణ దక్షిణ వైపు అదనంగా 15 ఫీట్ల మేర పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఉత్తరం 85 ఫీట్లు, దక్షిణం 115 ఫీట్లు రోడ్డును విస్తరించడం సరికాదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌కు సంబంధించిన పలువురు వ్యక్తులు బాధితులతో గొడవకు దిగడంతో ఘర్షణ వాతావరణం నెలకొన్నది. కోర్టు ఉత్తర్వుల ప్రకారమే పనులు చేయాలని బాధితులు మొండికేయడంతో కాంట్రాక్టర్ మనుషులు వెళ్లిపోవడంతో గొడవ సద్దుమణిగింది.

ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

● వ్యవసాయ శాఖ జేడీ శివప్రసాద్



నాగాపూర్ పీఏసీఎస్ కేంద్రంలో ఎరువుల నిల్వను పరిశీలిస్తున్న జేడీ శివప్రసాద్

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో ఎరువుల కొరత లేదని, కృత్రిమంగా ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి(జేడీ) శివప్రసాద్ హెచ్చరించారు. సంగారెడ్డి మండలం నాగాపూర్ గ్రామంలోని పీఏసీఎస్ కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు అవసరం మేరకే కొనుగోలు చేయాలని సూచించారు. ఎరువులను మోతాదులో వాడితేనే దిగుబడి పెరుగుతుందన్నారు. అనంతరం కేంద్రంలో ఎరువుల స్టాక్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట ఏవో ఝాన్సిలక్ష్మి బాయి, సిబ్బంది ఉన్నారు.

దేవర స్వాతికి కీర్తిచక్ర పురస్కారం



పురస్కారం అందుకుంటున్న స్వాతి

కొండపాక, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): యువ కవి, సాహితీరత్న అవార్డు గ్రహీత దేవర స్వాతికి కీర్తిచక్ర పురస్కారం లభించింది. కొండపాక మండలం అంకిరెడ్డిపల్లికి చెందిన స్వాతి, ఉన్నత విద్యను అభ్యసిస్తూనే కవిగా రచనలు చేస్తూ అనేక పురస్కారాలు అందుకుంటున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్, సాహితీ సంస్థల అధ్యక్షులు డాక్టర్ దూడపాక శ్రీధర్, డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్‌ల చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు. కీర్తిచక్ర పురస్కారంతో పాటు స్వర్ణ కంకణం, గోల్డ్ మెడల్ కూడా ఆమెకు లభించాయి. ఈ సందర్భంగా ఆమె రచించిన భారతమాతకు అభివందనం పుస్తకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థి దశలోనే ఈ అవార్డులు అందుకోవడంపై సిద్దిపేట కవులు, కళాకారులు, ఆమె కుటుంబ సభ్యులు అభినందించారు.

అమృత్ భారత్‌తో రైల్వేస్టేషన్ల అభివృద్ధి

● పనుల వేగవంతానికి చర్యలు
● సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ గోపాలక్రిష్ణ
● జహీరాబాద్ స్టేషన్ పరిశీలన



జహీరాబాద్ రైల్వేస్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం గోపాలక్రిష్ణ

జహీరాబాద్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్‌లో భాగంగా సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని పలు రైల్వేస్టేషన్లలో అభివృద్ధి పనులు చురుకుగా కొనసాగుతున్నాయని, వాటిని మరింత వేగవంతంచేసేలా చర్యలు చేపడుతున్నామని సికింద్రాబాద్ డివిజనల్ రైల్వేమేనేజర్ గోపాలక్రిష్ణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కర్ణాటక, మహారాష్ట్రల్లోని పర్లీ, జాల్నా, భాల్కి, బీదర్, జహీరాబాద్ ప్రాంతాల్లోని రైల్వేస్టేషన్లను సందర్శించారు. కొనసాగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు రైల్వే ద్వారా రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. అమృత్ భారత్‌లో భాగంగా సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో 36 రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కల్బుర్గీ నుంచి బీదర్‌వరకు నడిచే రైలును జహీరాబాద్ వరకు పొడిగించాలని, పూర్ణ-తిరుపతి రైలును జహీరాబాద్‌లో నిలిపేలా చూడాలని, బీదర్-హైదరాబాద్ ఇంటర్‌సిటీ రైళ్ల సంఖ్యను పెంచాలని స్థానిక నాయకులు ఆయన విన్నవించారు. అలాగే ముంబయికి వెళ్లే రైళ్లు వికారాబాద్, జహీరాబాద్ మీదుగా కొనసాగించాలని, ఖాజీపేట-సికింద్రాబాద్ రైలును నాంపల్లి రైల్వేస్టేషన్‌లో నిలిపేలా చూడాలని కోరారు. జహీరాబాద్ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసి త్వరలో వినియోగంలోకి తీసుకువచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గుప్త, జాగో తెలంగాణ రాష్ట్ర నాయకులు రాములు నేత, రైల్వే స్టేషన్ మేనేజర్ మాదవక్రిష్ణ తదితరులు డీఆర్ఎంను శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు న్నారు.

అవినీతికి అడ్డాగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ కన్స్యూమర్ సొసైటీ

● నాసిరకం వస్తువులు, బియ్యం, పప్పుల్లో పురుగులు
● ఆగ్రహించిన ఉద్యోగ సంఘాలు.. దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న యూనియన్లు, అసోసియేషన్లు, కన్స్యూమర్ సొసైటీ సభ్యులు

కంది, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని ఎద్దుమైలారం వద్దనున్న మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలోని కన్స్యూమర్ సొసైటీ అవినీతికి అడ్డాగా మారిందని ఉద్యోగ సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఆ సొసైటీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అవినీతి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ ఏడీఈఎఫ్ పాలక వర్గం ఏర్పడిన తర్వాత గత సంవత్సరం నుంచి ఒక్క నెల కూడా బ్యాలెన్స్ షీట్ అప్రూవల్ చేసుకోలేదన్నారు. కన్స్యూమర్ సొసైటీలో నాసిరకం వస్తువులు అధిక ధరలకు అమ్ముతున్నారని, దీంతో అమ్మకాల శాతం తగ్గిపోయిందని వాపోయారు. ఇటీవల ఈ సొసైటీలో ఉద్యోగులకు అందిచాల్సిన 50 కిలోల వేరుసెనగల బస్తా మాయమైపోయిందని విమర్శించారు. ఉప్మారవ్వ, బాదాం, జీడిపప్పుల్లో పురుగులు, బియ్యం రేటులో తేడా ఉందని మండిపడ్డారు. నాసిరకం వస్తువులు ఒక లారీ లోడు నిండా ప్యాకింగ్ కట్టలు అమ్ముకొని దానికి లెక్కలు వేయకుండా మాయం చేశారన్నారు. కన్స్యూమర్ సొసైటీలో పెట్రోల్ బంకులో జరిగిన అవకతవకలు రూ.70 వేలతో ప్రారంభమై ఇప్పుడు సొసైటీ మొత్తాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొసైటీని పారదర్శకంగా నడిపించాలని, ఏటా జనరల్ బాడీ సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో ఓఎఫ్ఎంఎస్, బీఎంఎస్, ఐఎన్‌టీయూసి, ఓఎఫ్ఆర్ఈయూ యూనియన్లు, అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.



సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు ప్రాజెక్టు

దసరా సెలవులు.. కారాదు విషాదం

● నిండుకుండల్లా ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు..
● పిల్లలు అటువైపు వెళ్లకుండా చూడాలంటున్న అధికారులు

కల్హేర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో చెరువులు, కుంటలు పూర్తిగా నిండిపోయాయి. దసరా సెలవుల సందర్భంగా విద్యార్థులు, యువకులు ఈతకు వెళ్లే అవకాశం ఉన్నందున, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ప్రస్తుతం చాలా మంది విద్యార్థులు, ఉద్యోగులు సెలవుల కోసం గ్రామాలకు చేరుకుంటున్నారు. ఇలాంటి సమయంలో సరదా కోసం చెరువుల్లోకి దిగితే ఈత రాక ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంది. గతంలో కల్హేర్‌లో ఇలాంటి ఘటనలు జరిగాయని, రాపర్తి ఊర చెరువులో ఇద్దరు విద్యార్థులు, రెండు సంవత్సరాల క్రితం నిజాంసాగర్ ప్రాజెక్టులో ఇద్దరు యువకులు మునిగి మరణించారని ఎస్సై మధుసూదనరెడ్డి గుర్తు చేశారు. వేసవిలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిగిన గుంతల్లో నీరు నిండటం వల్ల ప్రమాద అవకాశాలు మరింత ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. సెలవుల సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లలపై ఓ కన్నేసి ఉంచాలని సూచించారు. చెరువులు, కుంటల వద్దకు వెళ్లనీవకపోవడమే ఉత్తమమన్నారు. పిల్లలకు సెల్ ఫోన్లు కూడా ఇవ్వదని, తద్వారా సైబర్ నేరాల బారిన పడకుండా కాపాడాలని ఎస్సై సూచించారు.

బతుకమ్మ పూలకు

నారాయణఖేడ్ ప్రసిద్ధి

నారాయణఖేడ్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ పండుగ మొదలైంది. బతుకమ్మ తయారీకి గునక, తంగేడు, పట్టికుచ్చులు వంటి పూలు అవసరం. బతుకమ్మ పూలకు నారాయణఖేడ్ ప్రాంతం ఎంతో ప్రసిద్ధి. ఇక్కడ నీటి వనరులు తక్కువగా ఉండటం, బీడు భూములు అధికంగా ఉండటం వల్ల ఈ పూలు విరివిగా లభిస్తాయి. ఏటా పండుగ సమయంలో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ట్రాక్టర్లు, ఆటోలు, బైకులపై వచ్చి ఈ పూలను సేకరించి తీసుకెళ్తుంటారు. గత రెండు రోజులుగా ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు కామారెడ్డి జిల్లా నుంచి కూడా వందలాది వాహనాల్లో ఈ పూలను తరలిస్తున్నారు. ఈ సంవత్సరం ఎడతెరిపి లేని వర్షాల వల్ల తంగేడు, గునక పూలు అనుకున్నంతగా పూయలేదు. పూసిన కొద్దిపాటి పూలను సేకరించడానికి భారీగా ప్రజలు తరలివస్తున్నారు.



ఉత్సవాలకు రండి.. మంత్రులకు ఆహ్వానం





మంత్రులు కొండ సురేఖ, జూపల్లి కృష్ణరావుకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఆలయ సభ్యులు, నాయకులు

వర్గల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ విద్యాధరి క్షేత్రంలో కొనసాగుతున్న విద్యాసరస్వతీ అమ్మవారి శరన్నవరాత్రోత్సవాలకు హాజరు కావాలని మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణరావును ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో వారిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. వర్గల్ విద్యాధరి క్షేత్రాన్ని పర్యాటక ప్రాంతంగా గుర్తించి అభివృద్ధి చేయాలని కోరగా, మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు నూక భిక్షపతి గుప్త, ఏఎంసీ చైర్మన్ విజయ మోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్త తదితరులు ఉన్నారు.

నేడు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాక

వర్గల్ విద్యాధరి క్షేత్రానికి బుధవారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట కవిత రానున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న పూజా కార్యక్రమాల్లో ఆమె పాల్గొంటారని తెలిపారు.

పారదర్శకత విజయ డెయిరీ ప్రత్యేకత

● నాణ్యమైన పాల సరఫరా చేయడమే లక్ష్యం
● టీజీడీడీసీఎఫ్ జీఎం మధుసూదన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న టీజీడీడీసీఎఫ్ జీఎం మధుసూదన్‌రావు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పారదర్శకతే విజయ డెయిరీ ప్రత్యేకత అని తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ మధుసూదన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక విజయ డెయిరీలో డీడీ రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాల ఉత్పత్తిదారులకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛమైన పాల సేకరణ, సరఫరాపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. విజయ డెయిరీపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటమన్నారు. జిల్లాలో పలు రద్దీ ప్రాంతాల్లో విక్రయ కేంద్రాలను గుర్తిస్తామని, ఇందుకోసం ప్రత్యేక బృందాలతో సర్వే నిర్వహిస్తామన్నారు. వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు వివరించారు. సమావేశంలో సీక్యూసీ కవిత, పీవో ప్రసన్న, అకౌంట్స్ కళ్యాణి, విజయ్, డీడీ రమేష్, మెదక్, నారాయణఖేడ్, జహీరాబాద్ మేనేజర్లు, ఫీల్డ్ సూపర్‌వైజర్లు తదివతరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి సీఆర్‌పీకి జాతీయ స్థాయి అవార్డు



మరెల్లి దత్తు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్(సీఆర్‌పీ)గా పనిచేస్తున్న మరెల్లి దత్తు శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో అందజేసే నేషనల్ టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 25న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డు అందుకోనున్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో భాగంగా పేద విద్యార్థులకు అందిస్తున్న సహాయ సహకారాలను గుర్తించిన సొసైటీ ఉత్తమ సీఆర్‌పీగా ఎంపిక చేసిందని దత్తు తెలిపారు.

'గీతం' విద్యార్థిని రమాదేవికి డాక్టరేట్



డి.రమాదేవి

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌కు చెందిన ఈఈసీఈ విభాగం పరిశోధక విద్యార్థిని డి.రమాదేవి డాక్టరేట్‌కు అర్హత సాధించారు. 'ఫ్రేమ్‌వర్క్ కోసం తగ్గింపు, నిర్మాణాత్మక నమూనా కోసం ఆప్టిమైజ్డ్ టెక్నిక్‌ల అమలు'పై ఆమె సమర్పించిన సిద్ధాంత వ్యాసానికి ఈ పట్టా లభించింది. ఈ పరిశోధనకు గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, ఈఈసీఈ ప్రొఫెసర్ పి. త్రినాథరావు మార్గదర్శకత్వం వహించారు. డాక్టర్ రమాదేవి పరిశోధన వీజీ, అంతకు మించి కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లకు అవసరమైన మెరుగైన బిట్ ఎర్రర్ రేట్, తగ్గిన అవుట్ ఆఫ్ బ్యాండ్ రేడియేషన్‌పై దృష్టి పెట్టింది. ఆమెకు డాక్టరేట్ లభించడంపై గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి, డైరెక్టర్లు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

అత్యుత్తమ వంటగది సందర్శన

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆధునిక వంటగది రూపకల్పన, ఆవిష్కరణలపై అవగాహన కోసం గీతం విశ్వవిద్యాలయం ఇంటీరియర్ డిజైన్ విద్యార్థులు బీఎస్‌హెచ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను సందర్శించారు. ఈ పర్యటనలో సిమెన్స్, గగ్గెనౌ, బాష్ వంటి అంతర్జాతీయ బ్రాండ్ల అత్యాధునిక ఉపకరణాలను విద్యార్థులు ప్రత్యక్షంగా చూశారు. స్మార్ట్ ఆటోమేషన్, ఖచ్చితమైన పనితీరును ప్రదర్శించే పరికరాలను పరిశీలించడంతో పాటు, వంట సెషన్లలో కూడా పాల్గొన్నారు. నిపుణులైన కన్సల్టెంట్ల మార్గదర్శకత్వంలో, విద్యార్థులు ఆధునిక వంటగది ప్రణాళిక, మెటీరియల్స్, సాంకేతికత పాత్ర గురించి తెలుసుకున్నారు. ఈ సందర్శన వారి విద్యా ప్రయాణంలో ఒక ముఖ్యమైన అనుభవం అని గీతం అధికారులు తెలిపారు.



అత్యుత్తమ వంటగదిని సందర్శించిన గీతం విద్యార్థులు

దార్శనికుడు సాహితి రాము

● ప్రతీ బుధవారం పెద్దాస్పత్రిలో అన్నదానం
● పేదల 'క్షుద్బాధ'ను తీరుస్తూ

అందరి మన్ననలు పొందుతున్న రాము



సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులు, సహాయకులకు అన్నదానం చేస్తున్న సాహితి రాము

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): 'నరుడి ముఖం ద్వారా తినేది నారాయణుడే'. 'అన్నం పరబ్రహ్మ స్వరూపం'. అన్నదానం-మహాదానం అన్న వేద, పురాణేతిహాసల్లోని సారాన్ని ఆకలింపు చేసుకుని కొందరు సమాజంలో నిస్సహాయ స్థితిలో ఉన్న వారికి రకరకాల దానాలు చేస్తుంటారు. అన్నదానం అనేది ఒక దార్శనికమైన చర్యగా భవించబడుతుంది. అలాంటి దానాలు చేసే వారిలో సంగారెడ్డి పట్టణానికి చెందిన సాహితి రాము ముందు వరుసలో ఉన్నాడని చెప్పడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. రాము తన సంపాదనలో కొంత భాగాన్ని సమాజ సేవకు వెచ్చిస్తున్నారు. మానవసేవ-మాధవ సేవ అన్న నానుడిని నిజం చేస్తూ ఎంత ఖర్చుకైనా వెనకాడకుండా ప్రతీ బుధవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేస్తున్నారు. అయ్యప్ప స్వామి భక్తుడైన రాము ప్రత్యేకంగా అయ్యప్ప స్వామి జన్మనక్షత్రమైన రోజున కూడా పెద్దాస్పత్రిలో సుమారు 500 మందికి అన్నదానం నిర్వహిస్తూ తన మంచి మనసును చాటుకుంటున్నారు. గత మూడేళ్లుగా సర్కారు దవాఖానాకు వచ్చే పేదల ఆకలిని తీరుస్తున్న రాముకు మోక్షం లభించాలని, నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని రోగులు, సహాయకులు నిండుమనస్సుతో ఆశీర్వదిస్తున్నారు. రాము సేవను సంగారెడ్డి పట్టణ, జిల్లా ప్రజలు కొనియాడుతున్నారు.

భగవంతుడు ఇచ్చిన దాంట్లోనే..



ప్రతిఫలం, లాభాపేక్ష లేకుండా, నిస్వార్థంగా పేదలకు సేవ చేయాలన్నదే నా తపన. భగవంతుడు నాకు ఇచ్చిన శక్తిలో కొంత శక్తిని అన్నదానానికి కేటాయిస్తున్నాను. నా గొప్పదనం ఏమీ లేదు. పది మందికి సేవ చేస్తేనే జీవితానికి పరమార్థం ఉంటుందనే నానుడిని గట్టిగా నమ్ముతాను. ఇది అయ్యప్ప స్వామి దయతో చేస్తున్నాను.

- సాహితి రాము, సంగారెడ్డి

న్యూస్ బాక్స్

ఈ లైన్‌మన్ మాకొద్దు

కంగ్టి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యుత్ లైన్‌మన్ రాజు మాకొద్దు అంటూ మంగళవారం మండల పరిధిలోని జీర్గి తండావాసులు లైన్ ఇన్‌స్పెక్టర్ బాబుకు వినతిపత్రం అందజేశారు. మూడురోజులుగా జీర్గితండాలో కరెంట్ సరఫరా నిలిచిపోయిందన్నారు. దీంతో తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోయారు. విద్యుత్ సమస్య వచ్చినప్పుడు సమాచారం ఇస్తే లైన్‌మన్ స్పందించడం లేదన్నారు. తక్షణమే ఇతడిని తప్పించి వేరే లైన్‌మన్‌ను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జైపాల్, శ్రీనివాస్, దొండిబా, ధన్‌రాజ్, జలంధర్, ప్రేమ్, తదితరులు పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధిగ్రస్త పశువులకు చికిత్సలు చేయించాలి

తూప్రాన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పాడి పశువులలో పునరుత్పత్తి సమస్యలు ఏర్పడితే పాడి రైతుల లాభనష్టాల్లో ప్రభావితం చేస్తాయని, గర్భకోశ వ్యాధిగ్రస్త పశువులు ఉంటే వెంటనే చికిత్సలు చేయించి మందులు అందించాలని పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ వెంకటయ్య పేర్కొన్నారు. తూప్రాన్ మండలం యావాపూర్‌లో సత్యసాయి ట్రస్టు, లయన్స్‌క్లబ్ చేగుంట, తూప్రాన్ ఆధ్వర్యంలో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు.

హరీశ్‌రావును కలిసిన నాయకులు

మునిపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌లోని మాజీ మంత్రి హరీశ్‌రావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారివెంట ఎంపీపీ శైలజాశివకుమార్, మండల ప్రధాన కార్యదర్శి మంతూరు శివకుమార్, మాజీ ఎంపీటీసీ వెంకటేశం, యువ అధ్యక్షుడు ఆనంద్, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

నారాయణఖేడ్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేయడమే కాకుండా, గిరిజనులకు పదిశాతం రిజర్వేషన్ కల్పించారని మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్ అన్నారు. భవానీ దీక్షాధారులు మంగళవారం నారాయణఖేడ్‌లోని భవానీ ఆలయం వద్ద సేవాలాల్ మహరాజ్, రాంరావు మహరాజ్, భవానీమాత, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

పౌష్టికాహారంపై అవగాహన

నర్సాపూర్/చేగుంట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పోషణమాస ఉత్సవాల్లో భాగంగా నర్సాపూర్ బస్టాండ్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పౌష్టికాహారంపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో హేమభార్గవి పాల్గొని ఆకుకూరలు వాటి ప్రత్యేకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సరళ, కవిత, లక్ష్మీనర్సమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. చేగుంట సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యాధికారి అనిల్ కుమార్, సూపర్‌వైజర్ సువర్ణ గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు.

మత్తు పదార్థాలపై కొరడా

నిజాంపేట, సెప్టెంబకె 23 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, డ్రగ్స్ లాంటి నిషేధిత మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ రాజేష్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని కిరాణాలు, హోటళ్లు, వ్యాపార సముదాయాల వద్ద పోలీసులు డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. మత్తు పదార్థాలు విక్రయిస్తే 100 ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

ఘనంగా భోగ్‌బండార్

కంది, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కంది మండలం చిమ్నాపూర్ గ్రామంలో గిరిజన నాయకులు మోతీలాల్ ఆధ్వర్యంలో మంగళవారం భోగ్‌బండార్ నిర్వహించారు. ఈ సందర్భంగా భవానీమాత మాలాధారణ స్వాములు హోమంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెట్రోల్‌లో నీళ్లు

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని గవ్వలపల్లి ఎక్స్ రోడ్డు వద్ద పెట్రోల్ బంకులో పెట్రోల్‌కు బదులు నీళ్లు వచ్చాయని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులు కారులో పెట్రోల్ పోసుకొని కొద్ది దూరం వరకు ప్రయాణం చేశారు. ట్యాంకు నుంచి పెట్రోల్ తీస్తున్న క్రమంలో పెట్రోల్ నీళ్లు వచ్చాయి. బంకు వద్ద యాజమాన్యంతో ఘర్షణకు దిగారు.

స్థల పరిశీలన

వట్‌పల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం నిర్వహించే దసరా అలయ్.. బలయ్ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌తో పాటు బీఆర్‌ఎస్ నాయకులు వట్‌పల్లిలోని గురుకృప ఫంక్షన్ హాల్‌ను పరిశీలించి మాట్లాడారు. ఏడేళ్లుగా అలయ్, బలయ్ కార్యక్రవనిన్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శివాజీరావు, వరం కమిటీ మాజీ అధ్యక్షుడు వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే

నారాయణఖేడ్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గిరిజనుల అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ శివారులోని వెంకటాపూర్ చౌరస్తా రాంరావు మహారావు ట్రస్టు ఆలయం వద్ద మంగళవారం కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాంమహరాజ్‌తో కలిసి బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్ ఆధ్వర్యంలో భోగ్ బండార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయం వద్ద అరెకరం స్థలంలో బంజారా భవన్ నిర్మాణం కోసం రూ.2 కోట్లు మంజూరు చేయించినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఇరక్‌పల్లి పీఠాధిపతి దేవిదాస్ మహరాజ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, పండిత్ నాయక్, మోహన్‌నాయక్, గిరిజనులు పాల్గొన్నారు. దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా రెండోరోజు మంగళవారం నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట దుర్గామాత ఆలయంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆయన సతీమణి అనుపమ్మరెడ్డి ప్రత్యేక పూజలు చేసి, చండీ హవనంలో పాల్గొన్నారు. మండలంలోని ఎడ్లరేగడితండాలోని కాలుబాబా ఆలయంలో జరుగుతున్న జ్వాలాముకి అమ్మవారి ఉత్సవాల్లోనూ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. అనంతరం పూజారి మంగల్‌చంద్ మహరాజ్ ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పరశురాం, పండరినాథ్, మనోజ్ పాటిల్, లక్ష్మణ్, డేవిడ్ పాల్గొన్నారు.



ఖేడ్ శివారులో భోగ్ భండార్ అనంతరం పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి తదితరులు

ఓపెన్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● డీఈవో వెంకటేశ్వర్లు



సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ థియరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. అక్రమాలకు తావులేకుండా సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. కాగా రెండోరోజు ప్రశాంతంగా జరిగింది. ఉదయం జరిగిన ఇంటర్మీడియట్ ఆంగ్లం పరీక్షకు 112 మందికి 79 మంది హాజరుకాగా 33 మంది గైర్హాజరయ్యారు. టెన్త్ ఆంగ్లం సబ్జెక్టుకు 86 మందికి 69 మంది హాజరుకాగా 17 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన టెన్త్ ఐసీహెచ్ పరీక్షలకు ఎవరూ హాజరుకాలేదని డీఈవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు.

జీజీహెచ్‌లో నల్లబ్యాడ్జీలతో డాక్టర్ల నిరసన

● మహబూబాబాద్ డాక్టర్లపై దాడి ఖండన



సంగారెడ్డిలోని జీజీహెచ్ ఓపీ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న డాక్టర్లు

సంగారెడ్డి అర్బన్/మెదక్ కల్చరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బందిపై రోగి బంధువుల దాడిని ఖండిస్తూ సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డాక్టర్లు నల్లబ్యాడ్జీలతో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్లు గోవింద్, ఆనంద్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బందిపై దాడి హేయమైన చర్యేనన్నారు. దాడికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అనిల్ కుమార్, రమేశ్, సందీప్, విక్రమ్, శ్రీనివాస్, సంపూర్ణ, శ్రీలక్ష్మీ, శంకర్, విజయ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు. వైద్యులపై దాడిని ఖండిస్తూ సోమవారం మెదక్ జిల్లా జనరల్ ఆస్పత్రి ఎదుట స్థానిక వైద్యులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీతాదేవి, డాక్టర్ రవీంద్రకుమార్, జనార్దన్, జ్యోతి, అసోసియేట్ ప్రొఫెసర్ మణిపాల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉషూ క్రీడలో జిల్లాకు మంచిపేరు తీసుకురావాలి

● ఎస్జీఎఫ్ జిల్లా సెక్రటరీ గణపతి



ఉషూ క్రీడల్లో తలపడిన క్రీడాకారులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉషూ క్రీడా పోటీల్లో పతకాలు సాధించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఎస్జీఎఫ్ (ఇంటర్మీడియట్) జిల్లా సెక్రటరీ గణపతి సూచించారు. సంగారెడ్డిలోని కిసాన్ భవన్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-19 బాల బాలికల ఉషూ క్రీడా పోటీల ఎంపికలు మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు మహబూబాబాద్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడనున్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ దన్‌రాజ్, ఉషూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య, మాస్టర్ సాజిద్, చందర్ పాల్గొన్నారు.

ఉచిత యోగా, ఆయుర్వేద వైద్య శిబిరానికి స్పందన



సంగారెడ్డిలోని ఎస్వైఎస్ భవన్‌లో వైద్య సేవలందిస్తున్న ఆయుర్వేద వైద్యులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఎస్వైఎస్ భవన్‌లో ఉచిత యోగా, ఆయుర్వేద ఆరోగ్య వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లా యువజన క్రీడల అధికారి ఖాసీంబేగ్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్వైఎస్ అధ్యక్షులు దినేశ్ శిబిరాన్ని ప్రారంభించారు. 300 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా.ఎల్.శ్యామ్‌సుందర్‌ప్రసాద్ పాల్గొన్నారు.

బతుకమ్మ ఉత్సవాలు జయప్రదం చేయాలి

పటాన్‌చెరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జరగనున్న బతుకమ్మ ఉత్సవాలకు మహిళలు హాజరుకావాలని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరులో మహిళా సంఘాలతో సమావేశమై మాట్లాడారు. కేటీఆర్ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పై నిర్వహించే వేడుకలను జయప్రదం చేయాలన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్

అమ్మ దయతో అందరూ బాగుండాలి

చిలప్‌చెడ్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అమ్మ దయతో అందరూ బాగుండాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చిలప్‌చెడ్ మండలంలోని సామ్లాతండా, భద్ర్యతండాలో నిర్వహించిన భవానీమాత బోనాలలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనుల సంప్రదాయ వస్త్రాలు ధరించి కొద్దిసేపు గిరిజనులతో ఆడారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షులు లక్ష్మణ్, వీరస్వామి, యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా కల్యాణలక్ష్మి చెక్కులు అందించాం : భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అందరికీ కల్యాణలక్ష్మి చెక్కులు అందించామని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ గతంలో పెద్దశంకరంపేట మండల పరిధిలోని ఇసుకపాయల తండాకు చెందిన సుమలతకు 2017లో వివాహం జరిగిందని, ఉద్దేశపూర్వకంగా కల్యాణలక్ష్మి చెక్కు ఇవ్వలేదని తనపై కాంగ్రెస్ నాయకులు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆమె భర్త నాలుగు వివాహాలు చేసుకున్నట్లు అధికారులు గుర్తించి చెక్కు మంజూరు చేయలేదని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, నాయకులు రమేష్, దత్తు, మాణిక్‌రెడ్డి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఫోటోరైటప్.23.ఎస్ఆర్‌డి.2. సంగారెడ్డిలోని జీజీహెచ్ ఓపీ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న డాక్టర్లు

రాయసముద్రం చెరువు కట్టకు ప్రహరీ



చెరువు కట్ట ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించిన కార్పొరేటర్ పుష్పానగేష్

రామచంద్రాపురం టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చెరువులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. మంగళవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి రాయసముద్రం చెరువు కట్టకు ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించి మాట్లాడారు. నాగుళ్లమ్మ ఆలయం సమీపంలో కట్ట బలహీనంగా ఉందన్న ఫిర్యాదులకు స్పందించి రూ.16 లక్షలతో పటిష్టమైన గోడ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ దివ్య, నేతలు శ్రీను, కిరణ్‌గౌడ్, అప్పలభాస్కర్, ఐలేష్, శ్రీశైలం, మల్లేష్, కుమ్మరి సత్యనారాయణ పాల్గొన్నారు.

చందర్‌నాయక్‌తండా నుంచి తుల్జాపూర్‌కు పాదయాత్ర



తుల్జాపూర్‌కు పాదయాత్రగా వెళ్తున్న యువకులు

కంగ్టి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకొని మండల పరిధిలోని దెగుల్‌వాడి చందర్‌నాయక్‌తండాకు చెందిన యువకులు మంగళవారం మహారాష్ట్రలోని పవిత్ర పుణ్య క్షేత్రమైన తుల్జాపూర్ భవానీ ఆలయానికి పాదయాత్రగా బయలుదేరారు. తండాకు చెందిన 20 మంది యువకులు ఆరురోజుల పాటు పాదయాత్ర చేపట్టి తుల్జాపూర్‌కు చేరుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. పాదయాత్రకు అవసరమయ్యే వసతులను రాంతీర్థ్ గ్రామానికి చెందిన నార్నుల రమేష్ అందజేశారు.

వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

● పటాన్‌చెరువు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ మున్సిపల్ పరిధి ముత్తంగి, ఇస్నాపూర్‌లో వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు త్వరలో రూ.6 కోట్లతో బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించబోతునట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ముత్తంగి పరిధిలోని విజేత కాలనీ, చిట్కుల్ పరిధిలోని ఓడిఎఫ్ కాలనీ, రమణయ్య ఎంక్లేవ్, నాగార్జున కాలనీ, రాధమ్మ కాలనీ, బాలాజీ నగర్, బృందావన్ కాలనీ, రాయల్ కాలనీల్లో ఎమ్మెల్యే జీఎంఆర్ స్వయంగా పర్యటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు వెంకట కిషన్‌రావు, అజయ్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ డీఈ సురేష్, ఇరిగేషన్ డీఈ రామస్వామి, జాతీయ రహదారుల డీఈ రామకృష్ణ, విద్యుత్ డీఈ తులసీరావు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ ఉపేందర్ తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని, ప్రయాణికులు తమ సమస్యలు, సూచనల కోసం 8500376267 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో సొంతింటి కల నెరవేరింది



వల్లూరులో ఇందిరమ్మ ఇల్లును ప్రారంభిస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

చేగుంట ,సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పేదల సొంటింటి కలను సాకారం చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం నార్సింగి మండలం వల్లూరు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం పైలెట్ ప్రాజెక్టులో పూర్తయిన లబ్ధిదారులు చిన్నవల్లి రూప ఇంటి గృహ ప్రవేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఇల్లును ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు పిప్పిరి వినోద్‌గుప్తా, చేగుంట మండల అధ్యక్షుడు వడ్ల నవీన్, మత్స్యశాఖ మండల అధ్యక్షుడు సుధాకర్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో మధ్యతరగతికి మేలు



జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న మల్లేశం గౌడ్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకున్న నిర్ణయం ద్వారా జీఎస్టీ తగ్గి మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూర్చారని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్ మంగళవారం జిల్లా కేంద్రంలోని న్యూ వాసు హీరో షోరూంలో వాహనదారులకు జీఎస్టీ తగ్గుదలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైద్యానికి సీఎం సహాయ నిధి ఆసరా : ఎమ్మెల్యే



సీఎం సహాయ నిధి మంజూరుపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల వైద్యానికి సీఎం రేవంత్‌రెడ్డి సహకారం అందిస్తున్నారని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో 125 మంది లబ్ధిదారులకు రూ.54.74 లక్షల విలువైన మంజూరుపత్రాలను అందజేసి మాట్లాడారు. అత్యవసర సమయాల్లో వైద్యానికి సీఎం సహాయనిధి ప్రయోజనకరంగా మారిందని తెలిపారు. అనంతరం సాకి చెరువు కట్టపై ఈనెల 29న నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ ఉత్సవాలు వైభవంగా జరపడానికి వీలుగా ఏర్పాట్లను జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్ సురేష్‌తో కలిసి పరిశీలించారు.

●జహీరాబాద్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు రూ.1.80 లక్షల విలువచేసే చెక్కులను ఎమ్మెల్యే మాణిక్‌రావు అందజేశారు. కోహీర్ మున్సిపల్ పట్టణంలోని మిషన్ కాంపౌండ్ కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ యువ నాయకుడు నాగరిగారి దినకర్ మాతృమూర్తి సుశీలమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు అతని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు పాల్గొన్నారు.

●నారాయణఖేడ్: సీఎం సహాయనిధి ద్వారా 33 మందికి మంజూరైన రూ.10 లక్షల చెక్కులను ఎంపీ సురేష్‌షెట్కార్ సూచనల మేరకు జిల్లా ప్రణాళిక మండలి సభ్యుడు నగేష్‌షెట్కార్ బాధితులకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు శంకరయ్యస్వామి, సాగర్‌షెట్కార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాహేర్‌అలీ, ఎస్సీసెల్ అధ్యక్షుడు సాయిలు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.